# కర్ణాటక రాష్ట్రం – చాగనూరు, సిరివార భూరక్షణ పోరాటం – సంఘీభావ సభ



బళ్ళారిలో రైతాంగ ప్రదర్శన; వేదికపై అభివాదం చేస్తున్న వక్తలు

**వర్షాభావ** ప్రాంతమైన బళ్ళారి జిల్లాలో వాన నీడలే తప్ప జాడలు కానరావు. అలాంటి బళ్ళారిలో తుంగభద్ర జలాశయంద్వారా కొద్దిపాటి నీటి పారుదల వున్న తాలూకాలు మూడే మూడు. అవి ఒకటి హోసపేట, రెండు సిరుగుప్ప, మూడవది బళ్ళారి.

బళ్ళారిజిల్లా కేంద్రానికి అతిసమీపాన వున్న చాగనూరు సిరివార గ్రామాలు పుష్కలంగా నీటి పారుదల గలిగి సంవత్సరానికి రెండు పంటలు, ఒక్కొక్కసారి మూడుపంటలు కూడా పండే భూములను కలిగియున్న గ్రామాలు.

బళ్ళారిలో రెండు విమానాశ్రయాలు వున్నా కూడా మూడవ విమానాశ్రయం నిర్మించాలని అప్పటి(2008లో) బి.జె.పి ప్రభుత్వం నిర్ణయించడం, దానికొరకు చాగనూరు, సిరివార గ్రామాల నీటి పారుదల భూములను ఆక్రమించుకోవాలని చూడడం ద్వారా ఈ రెండు గ్రామాల రైతాంగంలో చిచ్చురగిల్చింది. రగిలిన ఆ చిచ్చే నీటి పారుదల భూములను రక్షించుకొనే భూపోరాటంగా మారింది. 2009లో ప్రారంభమైన ఈ భూపోరాటం నేటికీ సజీవంగా కొనసాగుతుంది. ప్రభుత్వ ఆక్రమణకు గురైన భూములను ఈ గ్రామాల రైతాంగం ప్రభుత్వపరం చేయకుండా సామాజిక, న్యాయ పోరాటాలను కొనసాగిస్తూ, అడుగడుగునా ప్రభుత్వ సవాళ్ళను ఎదుర్కొంటూ ఆ భూముల్లో బంగారం పండిస్తున్నారు.

పంటపొలాల్లో తీరికనెరగని రైతాంగం వ్యవసాయం చేస్తూనే చాగనూరు, సిరివార నీరావరి భూరక్షణా పోరాటసమితి అనే సంఘాన్ని ఏర్పరచుకొని పది సంవత్సరాలు గడచినా కూడా పోరాటాన్ని సజీవంగా వుంచడమనేది ఆహ్వానించ దగిన విషయం.

ఈ సందర్భంగా చాగనూరు, సిరివార, నిరావరి భూరక్షణా పోరాట సమితి, ప్రొ॥నంజుండస్వామి స్థాపిత కర్ణటక రాజ్య రైతు సంఘంతో కలసి రెండు రోజులపాటు రైతు సమావేశాలను ఫిబ్రవరి నెల 1, 2 తేదీలలో బళ్ళారిలోని రాఘవ కళామందిరంలో జరిపింది.

ఒకటవతేది ఉదయం చాగనూరు, సిరవార గ్రామాల నుండి రైతాంగం ఎద్దుల బండ్లను తీసుకొని రాఘవ కళామందిరానికి ప్రదర్శనగా చేరుకున్నారు. ఉదయం 11 గంటలకు ప్రముఖ సాహితీవేత్త తెలుగు కన్నడ ఉభయభాషల కవి జోళదరాశి గుత్త చంద్రశేఖరరెడ్డిగారు పచ్చజెండా ఊపగా ఎండ్ల బండ్ల ర్యాలీ మొదలైంది. ఈ ఎడ్లబండ్ల ర్యాలిలో ఏఐకెఎమ్‌కెఎస్ ప్రముఖులు కా॥ సుభోద్‌మిత్ర, కా॥ ఝూన్సిగార్లు, కర్ణాటక ప్రాంత రైతుసంఘం ప్రముఖులు మారుతి మాన్పడే, వ్యవసాయ శాస్త్రవేత్త జి.ఎన్.నాగరాజు, కర్ణాటక రైతుసంఘం నాయకులు శ్రీ జి.నారాయణ స్వామి, శ్రీ మాధవరెడ్డిగార్లు, బళ్ళారి ప్రముఖులు శ్రీ టి.జి.విఠల్, రైతు నాయకుడు మల్లిఖార్జునరెడ్డి పాల్గొనగా వందలాది ప్రజలు వారి వెంట నడిచారు. పచ్చని జెండాలతో ఎడ్ల బండ్ల ర్యాలి బళ్ళారి వీధుల్లో సాగుతుంటే బళ్ళారి నగరమంతా ఆకుపచ్చమయమై పోయింది. చివరకు ర్యాలి రాఘవకళామందిరం చేరుకొని రైతాంగ సమావేశానికి నాంది పలికింది. ఈ ర్యాలిలో అనంతపురం నుండి కా॥ పెద్దన్న నాయకత్వంలో వందమంది ప్రజలు సంఘీభావంగా పాల్గొన్నారు.

మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమైన సభలో ప్రముఖ ఉద్యమకారిణి శ్రీమతి ఖాజాబీని (సిరివార) అధ్యక్షత వహించారు. ఆహ్వానితులు, వక్తలు పాల్గొన్నారు. ఏఐకెఎమ్‌కెఎస్ కన్వీనర్ కా॥ సుబోధ్‌మిత్ర, కా॥ఝూన్సి సభనుద్దేశించి రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల గురించి మాట్లాడారు. అటు తరువాత మారుతి మాన్పడే, ఎస్.ఆర్.హిరేమత్, కా॥పెద్దన్న, నాగభూషణరావు, మాధవరెడ్డిగార్లు సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. కర్ణాటక రాజ్య రైతుసంఘ (కెఆర్ఆర్ఎస్) నాయకులు ఆర్. మాధవరెడ్డి మాట్లాడుతూ భూమిపై హక్కుకోసం దశాబ్దకాలంగా సాగుతున్న పోరాటం తమకెన్నో విషయాలను నేర్పిందన్నారు. “ఈ ఉద్యమం అనేకమంది స్నేహితులను సమకూర్చింది. భూమిపై మాకున్న ప్రేమ ఎన్నో కష్టనష్టాలకోర్చి ఎదురు నిలవగల స్థైర్యాన్ని ఇచ్చింది. మాపై బనాయించిన ఎన్నో కేసులను, అవమానాలను తట్టుకోగలిగాం. వ్యవసాయం ఓ జీవన విధానమని, ఇది మానవ జాతిని ప్రగతివైపు, నాగరికతవైపు నడిపిస్తుందని మేము నిజంగా నమ్ముతున్నాం” అన్నారు.

“ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలను మేము వ్యతిరేకిస్తున్నాం. వ్యవసాయం దండగ మారిదని భావించే వారి చర్యలను మేము తిరస్క రిస్తున్నామని రైతాంగాన్ని బిచ్చగాళ్ళుగా ఎదురు చూసేలా మలిచే విధానాలను తిప్పికొట్టి రైతులు, కూలీలు గౌరవంగా, హుందాగా తమ కష్టఫలం, తమ ఫలసాయంపై ఆధారపడి జీవిస్తారని తాము నమ్ముతున్నామని” భూసంరక్షణ కమిటి నాయకులు మల్లిఖార్జునరెడ్డి పేర్కొన్నారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) నుండి హాజరైన ప్రజాకళాకారుల బృందం ప్రదర్శించిన సాంప్రదాయ జానపద నృత్యాలు, దప్పునృత్యాలు సదస్సు ఆసాంతం ప్రజాకళాకారులు పాడిన పోరాట పాటలు ప్రతినిధులను ఆకట్టుకున్నాయి. ఈ సమావేశం సాయంకాలం 5.30 గంటలకు ముగిసింది.

సాయంకాలం 6 గంటలకు రచయితల, కళాకారుల సంయుక్త సమావేశం మొదలైంది. ఈ సమావేశానికి జోళదరాశి గుత్తి చంద్రశేఖర రెడ్డిగారు అధ్యక్షత వహించగా ఆహ్వానితులుగా ప్రొ॥రహమత్ తరికెరి(హంపి విశ్వవిద్యాలయం), శ్రీ సూర్యసాగర్, శ్రీ జన్ నాగరాజు, శ్రీ కల్కుర మొదలైనవారు పాల్గొన్నారు. ఈ సభలో తెలుగు, కన్నడ భాషల్లో ప్రచురించిన 'మా భూమి, మా పోరాటం', 'నమ్మభూమి, నమ్మహోరాట' అనే పుస్తకాల ఆవిష్కరణ వేదికపైన వున్న పెద్దల ద్వారా జరిగింది. చాగనూరు, సిరివార గ్రామాల రైతాంగం సాగించిన పోరాటం ఈ పుస్తకంలో సమగ్రంగా పేర్కొన్నారు. ప్రొ॥ రహమత్ తరికెరిగారు కన్నడ పుస్తకం గురించి విశ్లేషించారు. శ్రీ సూర్యసాగర్‌గారు తెలుగు పుస్తకం గురించి విశ్లేషించారు. ఇతర ప్రముఖులైన జన్. నాగరాజు, కల్కురగార్లు పోరాటంలో రైతులు ఎదుర్కొన్న కష్టాలను, అవమానాలను, వారు పట్టువిడవకుండా సాగిస్తున్న పోరాటాన్ని గురించి మాట్లాడారు. అధ్యక్షత వహించిన జోళదరాశి గుత్తి చంద్రశేఖరెడ్డిగారు, రైతులగురించి స్వీయ కవితను చదివి వినిపించారు. ఈ సభ రాత్రి 8.30 గంటలకు ముగిసింది.

రెండవరోజు రైతుసమావేశం స్థానిక సమస్యలను చర్చించడానికి జరిగింది. ఈ సభ ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. అధ్యక్ష వర్గంగా వి.నారాయణస్వామి కర్ణాటక రాజ్య రైతుసంఘం అధ్యక్షులు, చాగనూరు ఉద్యమ కారిణి శ్రీమతి లక్ష్మమ్మలు కొనసాగారు. ఈ సభలో కా॥ ఝూన్సి, కా॥ సుబోధ్‌మిత్ర, టి.జి. విఠల్, రైతు నాయకులైన హెచ్.ఆదినారాయణ రెడ్డి, ఆర్.మాధవరెడ్డి పాల్గొన్నారు.

ఈ సమావేశంలో రైతునాయక ప్రొ॥నంజుండస్వామి స్థాపిత కర్ణాటక రాజ్యరైతు సంఘం ఏఐకెఎమ్‌కెఎస్ అనుబంధసంస్థగా పనిచేయడానికి తీర్మానం జరిగింది. ఈ తీర్మానాన్ని ఏఐకెఎమ్‌కెఎస్ కన్వీనర్ కా॥ సుభోద్‌మిత్ర ఆమోదించారు. ఈ సభలో సభికులనుద్దేశించి కా॥ఝూన్సి, శ్రీ టి.జి.విఠల్, శ్రీ హెచ్.ఆదినారాయణ రెడ్డి, శ్రీ మాధవరెడ్డి మాట్లాడారు. స్థానిక సమస్యలైన ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరు, వ్యవసాయ కళాశాల బళ్ళారిలో నెలకొల్పాలని మరియు హగరి నది ఆనుకొని వున్న సుమారు క్షామపీడిత 12 గ్రామాలలో కరువునెలా ఎదుర్కోవాలని చర్చ జరిగింది. అటు తరువాత జిల్లాధికారి కార్యాలయానికి ఊరేగింపుగా వెళ్ళి స్థానిక సమస్యల నివారణకోరుతూ వినతిపత్రం ఇవ్వడం జరిగింది. దీనితో రెండురోజుల రైతు సమావేశం ముగిసింది.

ఈ రెండురోజుల సమావేశానికి అపురూపంగా అనుకోని అతిధిగా విచ్చేసిన కడప తెలుగుగంగ ప్రాజెక్ట్ ముఖ్య ఇంజనీరుగా పనిచేస్తున్న శ్రీ ప్రకాష్‌గారు పాపాగ్ని నదిలో తాము విజయ వంతంగా పూర్తిచేసిన సబ్ సర్‌ఫేస్ డ్యాం నిర్మాణాల గురించి, వాటి నుండి పొందిన లబ్ధి గురించి వివరంగా తెలియజేస్తూ పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు. ఇటువంటి వాటిని హగరి నదిలో కూడా నిర్మించవచ్చునని దీనికొరకు తన వంతు సహాయం చేస్తానని రైతులకు చెప్పడం చాలా ఉపయోగకరంగా వుంది.

ooooo